క్లుప్తంగా

ముద్దనూరు ఎస్‌ఐగా మైనుద్దీన్



ముద్దనూరు : స్థానిక అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్ సబ్–ఇన్‌స్పెక్టర్‌గా మైనుద్దీన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. చాపాడు పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న మైనుద్దీన్ ముద్దనూరుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ చంద్రమోహన్ కడప తాలూకాకు బదిలీపై వెళ్ళారు.

విగ్రహ ప్రతిష్టను విజయవంతం చేయాలి

జమ్మలమడుగు : ఈనెల 19న విజయవాడలో జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బడిగించల విజయలక్ష్మీ తెలిపారు. బుధవారం స్థానిక ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో అతి పెద్ద విగ్రహాలలో అంబేడ్కర్ విగ్రహం మూడో వదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్త శుద్ధితో కృషి చేయడం వల్ల నేడు విజయవాడలో 18 ఎకరాలలో 400 కోట్ల ఖర్చుతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలందరు కార్యాక్రమానికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ నాయకుడు చంద్రమౌళి, ఎస్సీ నాయకుడు ఉప్పలపాడు యోబు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

మురికి నీరును తొలగించాలని వినతి

ఎర్రగుంట్ల : స్థానిక 13వ వార్డులోని సెల్ టవర్ వీధిలో రోడ్డుపైన నిల్వ ఉన్న మురికి నీటిని తొలగించాలని ఆ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సునీల్‌కుమార్ బుధవారం మున్సిపల్ చైర్మన్ ఎం. హర్షవర్ధన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. చిన్నపాటి వర్షం పడితే చాలు రోడ్డుపైన నీరు నిల్వ ఉంటుందన్నారు. దీనిపై స్పందించిన చైర్మన్ మున్సిపల్ ఏఈ సురేష్‌బాబుతో మాట్లాడగా ఈ వీధి రోడ్డుకు లింక్ అయిన మెయిన్ రోడ్డు టెండర్ అయిందని దానితో పాటు ఈ రోడ్డును కూడా వేస్తామని ఏఈ తెలిపారు.

మాదిగలకు సమాన ప్రాతినిథ్యం కల్పించాలి

ఎర్రగుంట్ల : 2024 సాధారణ ఎన్నికల్లో అన్ని స్థానాలలో మాదిగలకు సమాన ప్రాతినిథ్యం కల్పించాలని ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ అన్నారు. బుధవారం పట్టణంలోని ఏపీ ఎంఆర్‌పీఎస్ నేతలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల్లో మాదిగలకు అన్ని స్థానాలలో రిజర్వేషన్ కల్పించాలని ఈనెల 20వ తేదీన విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో మాదిగల రాజకీయ మహా ప్రస్తావనం మొదటి సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని ఏపీ ఎంఆర్‌పీఎస్ ముఖ్య ప్రతినిధుల బృందం హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రతి మాదిగ సోదరుడు ఈ సమావేశానికి తప్పక హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులను ఆదుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలోని వివిధ కేటగిరీలలో పనిచేస్తూ రిటైర్డ్ అయిన ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కడప రీజినల్ సెక్రటరీ రఘునాథరెడ్డి కోరారు. బుధవారం ఆర్‌ఎం కార్యాలయం వద్ద వైఎస్సార్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు కనీసం రూ. 5 వేల జీవనభృతిని మంజూరు చేయాలని కోరుతున్నామన్నారు.

బీసీల ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : బీసీల ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో మేలుకో బీసీ ప్రజా తంత్ర రాజకీయ చర్చా వేదిక నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావుపూలే చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు కలసికట్టుగా ఉంటే ఏదైనా సాధించుకోవచ్చని అన్నారు. రాజకీయాల్లో ఎదుగుతున్న బీసీలకు సహకరించాలని కోరారు. బీసీల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్రె శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీలను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వాడుకున్నాయని అన్నారు. వారికి రాజ్యాధికారం కల్పించే దిశగా చర్యలు తీసుకోలేదని చెప్పారు. బీసీలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు.పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెన్నా సరళాదేవి మాట్లాడుతూ బీసీలు అంటే వెనుకబడిన వారు కాదని, అన్ని రంగాల్లో రాణించే నేర్పు వారికి ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలకు ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పాణ్యం సావిత్రమ్మ మాట్లాడుతూ బీసీలు రాజ్యాధికారం పొందినప్పుడే అన్ని విధాలా అభివృద్ధి చెందుతారని తెలిపారు. మల్లేల భాస్కర్ మాట్లాడుతూ రాజకీయ రిజర్వేషన్లు ఇస్తే తప్ప బీసీలు అభివృద్ధి చెందే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ద్యేయం

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



పులివెందులలో రైతు బజార్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి

తొండూరు : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ద్యేయమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. బుధవారం తొండూరు మండలంలోని మడూరు గ్రామంలో పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డిలతో కలిసి ఆయన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ క్లినిక్‌లను ప్రారంభించి మాట్లాడారు. జగనన్న ప్రతి ఒక్క పేదవానికి ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల హృదయాలలో దేవుడిలా నిలిచారన్నారు. సచివాలయాల ద్వారా పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు ఇంటి వద్దకే అందేలా చేశారన్నారు. అలాగే పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ద్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత కూడా జగనన్నకు దక్కుతుందన్నారు. మండలంలో పేదలై ఉండి భూములు లేని వారికి డీకేటీ పట్టాలు అధికంగా మంజూరు చేయించారన్నారు. అనంతరం ప్రజలనుంచి వచ్చిన వినతిపత్రాలను సంబంధిత అధికారులతో అక్కడికక్కడే చర్చించి పరిష్కరించారు. ముందుగా మడూరు గ్రామానికి ఎంపీ రాగానే గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్‌కు సంబంధించిన డైరీలు, క్యాలెండర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, పరిశీలకుడు రామమునిరెడ్డి, డైరెక్టర్లు, సురేష్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, శంకర్, ఎంపీటీసీ విజయశంకర్, సర్పంచు గోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు శశికాంత్‌రెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, తాలుకా కార్యదర్శి దశరథరామిరెడ్డి, మండల రైతు సంఘు నాయకులు, వెంకటరామిరెడ్డి, ఈశ్వరరెడ్డి, వైఎస్సాఆర్ సీపీ నాయకులు ఓబుల్‌రెడ్డి, రమణారెడ్డి, షఫీ, కొండయ్య, నవమోహన్, చంద్రశేఖరరెడ్డి, భాస్కరరెడ్డి, లారీల సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే జగనన్న ద్యేయం

పులివెందుల రూరల్ : రైతుల సంక్షేమమే రాష్ట్ర ముఖ్యంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్యేయమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో నూతనంగా సుమారు కోటి రుపాయాలతో నిర్మించిన వైఎస్సార్ రైతు బజార్‌ను పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహరరెడ్డిలతో కలసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం జగనన్న అనేక సంక్షేమ కార్యక్రమాలను ఏర్పాటు చేశారన్నారు. జగనన్న ప్రభుత్వంలో రైతులందరికీ ఎంతో మేలు జరిగిందన్నారు.

రైతులు పండించిన పంటలను ఉచితంగా రైతుబజార్లో అమ్ముకోవచ్చునన్నారు. అలాగే రైతు బజార్‌లో వ్యాపారాలు చేసుకునే వారు రూములను అద్దెకు తీసుకోవచ్చునన్నారు. రైతులకు ఎల్లప్పుడు జగనన్న ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాదు, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ సర్వోత్తంరెడ్డి, సివిల్ సప్‌లై డైరెక్టర్ గంగాధరరెడ్డి, నూరుబాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్, వాల్మీకి సంఘం డైరెక్టర్ నారాయణస్వామి, నాయకులు బలరామిరెడ్డి, పుష్పనాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామమల్లేశ్వరరెడ్డి, కౌన్సిలర్లు, కోడి రమణ, డేనియల్, చంద్రమౌళి, నూరుల్లా, వీరా, సెక్రటరీ రత్నరాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి రానున్నారు.

చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కు లో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికి త్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌పెక్షన్‌తో మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికి త్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనే క సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యం



మాట్లాడుతున్న కళాశాల డీన్ ఎంఎస్ బేగ్

పులివెందుల రూరల్ : లింగాల మండలంలో దత్తతు తీసుకున్న గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఆహార సాంకేతిక కళాశాల అసోసియేట్ డైరెక్టర్ ఎంఎస్ బేగ్ తెలిపారు. నేటి నుంచి ఈనెల 23 వరకు జాతీయ సేవా పథకంలో భాగంగా మండలంలోని ఇప్పట్ల గ్రామంలో అధ్యాపకులు, విద్యార్థులు బుధవారం ఏర్పాటు చేసిన మొదటి రోజు జాతీయ ప్రత్యేక శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏడు రోజుల పాటు జరిగే వివిధ కార్యక్రమాల వివరాలు తెలిపారు. కళాశాల దత్తత తీసుకున్న గ్రామాలలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి గ్రామాలను అన్ని విదాల అభివృద్ధి చేస్తామన్నారు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, గ్రామస్థులతో కలసి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచు అంకాలమ్మ, జాతీయ సేవా పథకం అధికారి నజ్మా, కళాశాల అధ్యాపకులు జయమ్మ, దీప్తి, రాజశేఖర్, ఎన్‌వీ సుబ్బారెడ్డి, సేవా సమితి అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

అల్ట్రా క్రికెట్ టీమ్‌కు ట్రోఫీ అందజేత



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బక్కన్నగారి పల్లె గ్రామంలో నిర్వహించిన కృష్ణా నాయక్ మెమోరియల్ మెగా క్రికెట్ టోర్నమెంట్ విజేతగా అల్ట్రా క్రికెట్ టీమ్ నిలిచింది. విజేతకు వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి తనయుడు, యువ నాయకుడు సాయిభైరవ్ ప్రీతమ్ రెడ్డి, సర్పంచ్ మల్లయ్యలు ట్రోఫీని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని యువతను ఉత్సాహపరుస్తూ పెద్ద ఎత్తున క్రికెట్ టోర్నమెంటును నిర్వహించడం సంతోషదాయకమన్నారు. టోర్నమెంటు నిర్వాహకులను అభినందించారు. మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచిన బాలాజీ నాయక్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన ప్రభాకర్ నాయక్ కు ప్రత్యేక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పద్మనాభ రెడ్డి, ఎంపీటీసీ వరాలమ్మ, మాజీ సర్పంచులు నాగసుబ్బయ్య, బయన్న, ఫిజికల్ డైరెక్టర్ రాజాతోపాటు టోర్నమెంట్ విజేతగా నిలిచిన అల్ట్రా టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన



ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని 4వ వార్డులో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డితో కలసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి ఆ పథకం యొక్క పూర్తి సమాచారాన్ని వివరించాలన్నారు. దగ్గరుండి పథకాలకు దరఖాస్తు చేయించాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించే బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. రాష్ట్రంలో పేద ప్రజల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సక్రమంగా అమలు చేస్తున్న ఘనత మన ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్న ప్రభుత్వానికి అన్ని వర్గాల ప్రజలు అండగా ఉండాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీలు ఒప్పుకుంటేనే వచ్చేవని, ప్రస్తుతం జగనన్న పాలనలో లబ్ధిదారులనే పథకాలు వెతుక్కుంటూ వస్తున్నాయన్నారు. సుపరిపాలన దీర్ఘకాలంగా కొనసాగాలంటే మళ్లి జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు బాలయ్య, కౌన్సిలర్ సునీత, కె చంద్రఓబుళరెడ్డి, బాబుల్‌రెడ్డి, ఆనందరెడ్డి, నారపురెడ్డి, వై. నాగేంద్రారెడ్డి, హనుమంతురెడ్డి, రఘునాథ్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, ఓబుళరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తించేందుకే క్రీడా పోటీలు



కబడ్డీలో నియోజకవర్గస్థాయికి ఎంపికైన జట్టుతో ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి

పెండ్లిమర్రి : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పెండ్లిమర్రి జూనియర్ కళాశాలలో బుధవారం మండలస్థాయి బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. బ్యాడ్మింటన్‌లో పాతసంగటిపల్లె మహిళా జట్టు, కబడ్డీలో నంది మండలం పురుషుల జట్టు ఫైనల్‌లో విజయం సాధించి నియోజకవర్గ స్థాయికి ఎంపికైయ్యాయన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శివరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మిపతి, సుధాకర్, ప్రశాంత్ సాగర్ పాల్గొన్నారు.

కులగణన పారదర్శకంగా నిర్వహించాలి

గోపవరం : ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే కులగణనపై సర్వే పారదర్శకంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ సిబ్బందిని ఆదేశించారు. వలంటీర్, సచివాలయ సిబ్బంది వెళ్లి నిర్దేశిత ఫార్మాట్‌లో ఆన్‌లైన్‌లో సర్వే చేయడంతో పాటు కుటుంబ సభ్యులు ఎవరో ఒకరి చేత బయోమెట్రిక్ వేయించాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు ఎట్టిపరిస్థితుల్లోను అడగవద్దని, నిర్వహించే సర్వే అత్యంత పారదర్శకంగా ఉండాలన్నారు. కులగణనలో ప్రతి కుటుంబం పాల్గొని అవసరమైన సమాచారాన్ని సిబ్బందికి ఇవ్వడంతో పాటు వారికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సర్వేకు సంబంధించి ప్రజాప్రతినిధులు, ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు.

నేడు కులగణనపై సమీక్ష : కులగణన సర్వేకు సంబంధించి గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో సమీక్ష సమావేశం ఉంటుందని మండల ప్రత్యేకాధికారి నాగరాజ తెలిపారు.

లూయీ బ్రెయిలీ విగ్రహం ఏర్పాటు చేయాలి



వైఎస్ మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వికలాంగుల నెట్‌వర్క్ నాయకులు

పులివెందుల టౌన్ : దివ్యాంగుల జీవితాలలో వెలుగులు ప్రసాధించిన మహనీయుడు అంధుల లిపిప్రదాత లూయీ బ్రెయిలీ విగ్రహాన్ని పులివెందుల ప్రధాన కూడలిలో ఏర్పాటు చేయాలని ఏపీ దివ్యాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి కోరారు. దివ్యాంగులతో కలసి బుధవారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసంలో ఆయనను కలసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలో మోడల్‌సిటీ తరహాలో రోడ్ల విస్తరణ కార్యక్రమాలు, కొత్త సర్కిళ్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఏదైనా ఒక కూడలిలో వికలాంగుల లూయీ బ్రెయిలీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే భావితరాలకు ఆయన అంధులకు చేసిన సేవలను గుర్తించుకుని స్మరించుకుంటారన్నారు. అందుకు ఆయన స్పందిస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపి తప్పకుండా ఏర్పాటు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సునీల్, చంద్రఓబులరెడ్డి, బాబు, సిద్దారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మైదుకూరు : ప్రియ మిత్రులారా.. ఎలా ఉన్నారు.. ఏం చేస్తున్నారు.. పిల్లలు ఎంత మంది.. ఈ విధంగా ప్రశ్నల పరంపర సాగింది. మైదుకూరులో జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1995 – 96 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల మధ్య పట్టణంలోని ఎస్‌సీఆర్ కల్యాణ మండపంలో బుధవారం 1995 – 96 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉద్యోగ రీత్యా, వ్యాపార రీత్యా ఎక్కడెక్కడో ఉన్న వారంతా కుటుంబాలతో సహా వచ్చి ఒక చోట చేరారు. మైదుకూరు హైస్కూళ్లలో 28 ఏళ్ల కిందట చదువుకున్న తాము ఎక్కడున్నది.. ఏమి చేస్తున్నది ఒకరికొకరు చెప్పుకున్నారు. పాత జ్ఞాపకాలు తెలియజేసుకున్నారు. ఆనందాన్ని పంచుకున్నారు. చదువు చెప్పిన గురువుల సందేశాన్ని విన్నారు. గురువులతో కలసి అందరూ గ్రూప్ ఫొటో దిగారు. మళ్లీ తప్పకుండా కలుసుకోవాలని తీర్మానించారు.

22న తుది ఓటర్ల జాబితా విడుదల



మాట్లాడుతున్న ఆర్డీఓ జి.శ్రీనివాసులు

జమ్మలమడుగు : ఈనెల 22వ తేదీ సోమవారం నియోజకవర్గ తుది జాబితాను విడుదల చేస్తామని ఆర్డీఓ జి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయ సభాభవనంలో రాజకీయ పార్టీ నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఇచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో తమ అధికారులు, బీఎల్‌ఓలు పరిష్కరించారన్నారు. 2012 నుంచి నియోజకవర్గంలో మరణించిన వారి ఓట్లలో మార్పులు చేర్పులు చేపట్టలేదన్నారు. ప్రస్తుతం 12వేలకు పైగా మరణించిన వారి ఓట్లను, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారికి సంబంధించిన 8వేల ఓట్లను మొత్తం 20వేల ఓట్లను తొలగించామన్నారు. ఈనెల 22వ తేదీన వెలువడే ఓటర్ల జాబితాలో ఈనెల 9వ తేదీ వరకు నమోదు చేసుకున్న ఓటర్ల వివరాలు మాత్రమే ఉంటాయన్నారు. ఆ తర్వాత దరఖాస్తులు చేసుకున్న వారికి మరో జాబితో చేర్పుతామన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు కచ్చితంగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీ నాయకులు మరణించిన వారి ఓటర్లను గుర్తించి వారిని తొలగింపునకు సహకరించాలని సూచించారు. నియోజకవర్గంలో దాదాపు రెండువేల వరకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని కూడా పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గురప్ప, రాజకీయ పార్టీకి చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు

గోపవరం : నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే సంబంధిత డీలర్లపై చర్యలు తప్పవని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ హెచ్చరించారు. బుధవారం టి.వి.మోహన్‌రాజ ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు. గడువు తీరిన పురుగు మందులు, గడ్డ కట్టిన పాత ఎరువులు రైతులకు విక్రయించవద్దని, 15 రోజులకొకసారి స్టాకు వివరాలను వ్యవసాయాధికారికి తెలియజేయాలన్నారు. ఎరువులు, పురుగు మందుల కోసం వచ్చిన రైతుల వివరాలు సేకరించి బయోమెట్రిక్ వేయించడంతో పాటు ఎమ్మార్పీ ధరలకు మించకుండా అమ్మకాలు జరపాలన్నారు. ఎరువుల బస్తాల తూకాల్లో అనుమానాలు ఉంటే రైతులు తూకం వేసి చూసుకునే వెసులుబాటు కల్పించాలని డీలర్లకు తెలిపారు. కొనుగోలు చేసిన ఎరువులు, పురుగు మందులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు.

కొనసాగుతున్న సమ్మె

ప్రొద్దుటూరు : ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె బుధవారం 37వ రోజుకు చేరింది. స్థానిక శివాలయం సెంటర్‌లో వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెన్‌ఫిట్ రూ.5లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు. వీరికి కొవ్వూరు బాలచంద్రారెడ్డి మద్దతు తెలిపారు.

తగ్గనంటున్న కూరగాయల ధరలు

కడప అగ్రికల్చర్ : కూర గాయల ధరలు తగ్గనంటున్నాయ్. దీంతో సామాన్యుడికి పచ్చడి మెతుకులు తప్పడం లేదు. పచ్చిమిరపకాయ, టమాట ధరలు అధికంగా ఉన్నాయి. మొన్నటి దాకా కిలో రూ. 10 ఉన్న టమాటా ధర మళ్లీ రూ. 25 చేరింది. అలాగే మిరపకాయలు కూడా కిలో రూ. 40 చేరింది. దీంతో పచ్చడి మెతుకులు తిందామన్నా వీలుకాని పరిస్థితి. మిగతా కూరగాయల పరిస్థితి కూడా అలాగే కొనసాగుతోంది. కిలో బీన్స్ రూ. 70, అనపకాయలు, క్యాప్సికం, చేమగడ్డలు కిలో రూ. 60, క్యారెట్, అలసందలు, చిక్కుడుకాయ, మటిక్కాయ, కాకరకాయలు కిలో రూ. 50, బీట్‌రూట్, దొండకాయ, బజ్జిమిరప, క్యాలీఫ్లవర్, కిలో రూ. 40, బంగళాదుంప, దోసకాయ, బీరకాయలు కిలో రూ. 35, క్యాబేజీ, ముల్లంగి, బెండకాయలు కిలో రూ. 30, వంకాయ కిలో రూ. 25, సొరకాయ కిలో రూ. 20 చొప్పున కడప రైతు బజార్‌లో ధరలు కొనసాగుతున్నాయ. దీంతో కూరగాయల కొని తినాలంటే భారంగా ఉందని సామాన్యులు చెబుతున్నారు.ఈ ధరలు కొన్ని రోజులు ఇలాగే కొనసాగే అవకాశం ఉన్నట్లు రైతు బజార్, కూరగాయల షాపుల నిర్వాహకులు తెలిపారు.

ఇది రామకార్యం..ఐక్యతతో జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి

కడప కల్చరల్ : శ్రీరామ క్షేత్ర తీర్థ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 22న అయోధ్యలో జరగనున్న శ్రీ బాలరాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా కడపలో తలపెట్టిన శ్రీరామ శోభాయాత్రను రామకార్యంగా భావించాలని, ఐక్యతతో నిలిచి కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు సిద్ధం కావాలని పలువురు హిందూ ధార్మిక వేత్తలు, సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. బుధవారం కడప నగరం హౌసింగ్‌బోర్డులోని శ్రీ కోదండ రామాలయంలో ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి, ప్రధాన ప్రతినిధి చెన్నకృష్ణారెడ్డిల పర్యవేక్షణలో నగరానికి చెందిన పలు దేవాలయాల ప్రతినిధులు, నిర్వాహక కమిటీ సభ్యులు, విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామ శోభాయాత్ర ఐక్యవేదిక ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని తలపెట్టామని, చిన్నచౌకులోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం వద్దనుంచి ఉదయం 7 గంటలకు శోభాయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. యాత్ర కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని, పార్టీలకు అతీతంగా హిందూ బంధువులంతా పాల్గొనాలని కోరారు. అందరూ ర్యాలీలో సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొనాలని, బొట్టు లేదా తిలకధారణ చేయాలన్నారు. ఆలయం వద్ద నుంచి ప్రత్యేకమైన రథంలో 18 అడుగుల శ్రీరాముని విగ్రహంతో వేద పండితుల పూజలతో ర్యాలీ మొదలవుతుందన్నారు.చెన్నకృష్ణారెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో, ఒకరినొకరు సమన్వయం చేసుకుంటూ యాత్రను జయప్రదం చేయాలని సూచించారు. ధార్మిక సంస్థల ప్రతినిధి రాణా ప్రతాప్ మాట్లాడుతూ ఇప్పటివరకు ర్యాలీకి సంబంధించి తీసుకున్న చర్యలు, చేస్తున్న ఏర్పాట్ల గురించి వివరించారు. నాడు జరిగిన కరసేవలో ప్రాణాలు అరిపించిన వారి బంధువులను ఈ సందర్భంగా సత్కరిస్తున్నామని తెలిపారు. 22న రామాలయంలో విగ్రహ ప్రతిష్ట అనంతరం సాయంత్రం నగర సమీపంలోని పాలకొండల్లో ధార్మిక ప్రముఖుడు సట్టి భారవి ఆధ్వర్యంలో మారెమ్మ ఆలయ భక్తబృందం అఖండ శ్రీరామ జ్యోతిని వెలిగిస్తుందని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో నగర ప్రముఖులు రాజోలి వీరారెడ్డి, దుర్గాప్రసాద్, సుంకర శ్రీనివాస్, దేవతి శంకరయ్య, అర్చక సంఘం అధ్యక్షులు విజయ్‌భట్టర్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మునగా శ్రీనివాస్, మిస్టర్–వి వర్మతోపాటు నగరానికి చెందిన పలువురు ధార్మిక సంఘాల ప్రతినిధులు, భక్త ప్రముఖులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు భరోసా



ఆరోగ్య సురక్ష కిట్లను అందజేస్తున్న చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి



జమ్మలమడుగులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎర్రగుంట్ల : స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ కేంద్రంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తోందన్నారు. అనంతరం వైద్యుల ఆధ్వర్యంలో వివిధ వైద్య పరీక్షలను నిర్వహించి వైద్యసేవలను అందించి మందులను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక సాయిబాబా దేవాలయం వద్ద ఉన్న అర్బన్‌హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్యంపై పరీక్షలను నిర్వహిస్తారన్నారు.

అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు మందుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 దరఖాస్తుల గడువు పొడిగించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రభుత్వం గ్రూప్–2 దరఖాస్తుల గడువును పొడిగించాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్ తెలిపారు. బుధవారం స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప్–2 వెబ్ సైట్ పనిచేయకపోవడంతో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేకపోయారన్నారు. చాలా మంది నిరుద్యోగులు నెట్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే గ్రూప్– 2 దరఖాస్తులకు గడువు పొడిగించాలని కోరారు.